
# సింగిల్ పేజి కథలు

## తోచడం!

**"విజయవాడ నుండి విశాఖపట్నం వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిమిషములలో ప్లాట్‌ఫారం నెంబరు మూడు నుండి బయల్దేరుటకు సిద్ధంగా ఉంది."**

అనౌన్స్‌మెంట్ వింటూనే, పరుగులాంటి నడకతో తను సీటు రిజర్వు చేసుకున్న బోగీ ఎక్కి సీటులో కూర్చున్నాడు భాస్కర్. మరుక్షణమే, ఇంతవరకు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ తన కోసమే ఆగిందా అన్నట్లుగా బయలుదేరింది. 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు భాస్కర్. అసలే శీతాకాలం. అందులోనూ కొరికే చలి. తెల్లవారగట్ల నాలుగు గంటలకి లేస్తే కానీ స్టేషన్ చేరుకోలేడు. అయినా ఈ రైల్వేవాళ్లు కొంప మునిగిపోయినట్లు ప్రొద్దున్నే ఆరు గంటలకే బయల్దేరే టైము పెట్టాలా అనుకుంటూ తనకి ఎదురు సీటులో కూర్చున్న మనిషిని చూసి కొంచెం నిరాశపడ్డాడు.



ఒక సాధూజీ ప్రశాంతంగా కళ్లు మూసుకుని కూర్చున్నారు. వయసులో ఉన్న కుర్రాళ్లు ప్రయాణం చేసేటప్పుడు ఎదురుగా ఏ అమ్మాయో కూర్చుంటే, ప్రయాణమంతా ఆ పిల్లకేసి దొంగచూపులు చూస్తూ గడిపేయచ్చనుకుంటారు.

ప్రయాణం అరగంట సాగిందో లేదో అప్పుడే భాస్కర్‌కి బోరుకొట్టడం మొదలుపెట్టింది. అమ్మో! ఇంకా ఆరు గంటలు ఎలా కూర్చోవాలో అన్న ఆలోచనలో పడ్డాడు. పగలు ప్రయాణమంటే ఇదే బోరు అనుకున్నాడు. అసలే తను వెడుతున్నది స్టీలుప్లాంటులో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి. ఎంతో టెన్షనుగా ఉంది. తను స్టేషన్లో కొనుక్కున్న 'హిందూ' పేపరు బేగ్‌లోంచి తీసి చదవడం మొదలుపెట్టేడు. ఒక అరగంటలో చాలామటుకు చదివేసి పక్కన పెట్టేడు.

కొంచెం కొంచెంగా నిద్ర వస్తోంది. కానీ, 'కాఫీ కాఫీ', 'చాయ్ చాయ్' కుర్రాళ్ల అరుపులతో ఆ నిద్ర కాస్తా ఎగిరిపోతోంది. టిఫిన్ చేసేస్తే ఒక పనైపోతుంది కదా అనుకున్నాడు. అయినా, ఇప్పుడైతే బోగీలో ఎక్కువమంది లేరు గానీ, రాను రాను జనాలు రిజర్వేషన్ లేకపోయినా పిచ్చి పిచ్చిగా ఎక్కేసి, "కొంచెం జరుగుతారా ప్లీజ్" అంటూ అదేదో రైట్‌లాగ అడుగుతారు. 'సారీ' అంటే కోపంతో ఏదేదో గొణుక్కుంటారు. అంతేకానీ నాలుగు రోజులు ముందే ఈ సీటు కోసం క్యూలో నిలబడి, ఎన్ని అవస్థలు పడి రిజర్వు చేయించుకున్నామో వాళ్లకవసరం ఉండదు. అప్పుడింక టిఫిన్ తిందామన్నా చెయ్యి నోటి దాకా వెళ్లడానికి కూడా వీలుండదు.

ఇన్ని ఆలోచించుకుని వెంటనే ఇడ్లీ, వడ లాగించేసి మంచినీళ్లు తాగి బ్రేవ్‌మని తేన్చి, ఇంక ఇప్పుడు ఏం చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాడు. తను తెచ్చుకున్న 'వీక్' మ్యాగజైన్ బేగ్‌లోంచి తీసి చదివేడు. ఈ సాధూజీ ఒకరు. తనకేసి చూస్తూ మునిముని నవ్వులు నవ్వుకుంటూ ఉంటారు. ఇంతలోకే రాజమండ్రి స్టేషను వచ్చేసింది. కూర్చుని కూర్చుని బోరుకొట్టి, ఇక్కడ కొంచెంసేపు ఆగుతుంది కదా ప్లాట్‌ఫారం మీదకి దిగి కాఫీ తాగితే పోలేదా అనుకుని, తన సీటు రిజర్వుడు అయినా ఎందుకేనా మంచిదని, ఎదురుగా ఉన్నా సాధూజీతో "కొంచెం సీటు చూస్తారా?" అనడిగేడు.

ఆయన అలాగే అన్నట్లు తల ఊపితే దిగేడు. కాఫీ త్రాగి, గార్డు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ట్రైన్ ఎక్కేసి, మళ్లీ తన సీటులో ఆశీనుడయ్యాడు. అనుకున్నట్లుగానే ఆఫీసులకి షటిల్ చేసే ఉద్యోగులంతా బిలబిలమంటూ ఎక్కేశారు. తనది సింగిల్ సీటర్ కాబట్టి సరిపోయింది. అదే త్రీ సీటరైతే కాలు కొంచెం చాచుకోడానికుండదు. చెయ్యి కదపడానికుండదు. ఇంతలో అంతమంది ప్రయాణీకుల మధ్యలో నుండీ పెద్ద జామకాయల బుట్టతో ఒకమ్మాయి 'జామకాయలు జామకాయలు' అంటూ అమ్మకానికి వచ్చింది. సరే, పనేముంది, రెండు మంచి జామకాయలు సెలక్టు చేసుకుని, చెట్టు కింద కట్టేసిన ఆవు హాయిగా పడుకుని నెమరు వేసుకుంటున్నట్లుగా నెమరువేసుకున్నాడు. పక్కనే త్రీ సీటర్లో కూర్చున్న ఒక పెద్దమనిషి దగ్గర ఏదో పేపరు ఉంటే అడిగి తీసుకుని, ఆమూలాగ్రంగా చదివేసేడు.

స్టేషన్లు వస్తూనే ఉన్నాయి. సామర్లకోట, పిఠాపురం, అన్నవరం వగైరా ఎక్కేవారు ఎక్కుతూనే ఉన్నారు. దిగేవారు దిగుతూనే ఉన్నారు. ఈసారి కుర్రాళ్లు వేడివేడిగా 'కట్‌లెట్స్' తీసుకు వస్తున్నారు. ట్రైను విశాఖపట్నం చేరడానికి ఇంకా చాలా టైము పడుతుంది. అందుచేత లైట్‌గా రెండు కట్‌లెట్స్ లాగించేస్తే పోలే అనుకుని తన ఐడియాని తక్షణం అమల్లో పెట్టేశాడు. నిద్ర ముంచుకు వచ్చేస్తోంది. ఈ నిద్రాదేవత ఎప్పుడు వస్తుందో తెలీదు. ఎప్పుడు పోతుందో తెలీదు. టీ తాగితే బాగుంటుందని చాయ్ కుర్రాడిని పిల్చి టీ తాగేడు. ఇంతలో తుని రైల్వేస్టేషన్ వచ్చింది.

కాస్సేపు, ట్రైన్ దిగితే బాగుంటుందనుకుని, మళ్లీ ఎదురుగా కూర్చున్న సాధూజీని కొంచెం సీటు చూస్తారా అన్నట్లు సైగ చేసి ఆయన చిరునవ్వుతో సరే అన్నట్లుగా తల ఊపితే, నెమ్మదిగా ప్లాట్‌ఫారం మీదకు దిగేడు. బండి మీద అరటిపళ్లు అమ్ముతూంటే రెండు అరటిపళ్లు కొనుక్కుని తిన్నాడు. అటూ ఇటూ చూసి మళ్లీ ట్రైనెక్కేశాడు. వచ్చి సీటులో కూర్చున్నాడు. ఎదురుగా సాధూజీ మునిముని నవ్వులు నవ్వుకుంటున్నారు.

అనకాపల్లి వచ్చింది. హమ్మయ్య ఇంక దగ్గరపడ్డామనుకొని, ఏమిటి ఈ సాధూజీ రైలెక్కినప్పటి నుంచి, కూర్చున్న చోటు నుండి కదలకుండా ఒక కాఫీగానీ, ఒక టీగానీ తాగలేదు. ఒక టిఫిను తినలేదు. ఒక పేపరు చదవలేదు. తన సందేహాన్ని ఆయన్నే అడిగి తెలుసుకుందామని, "సార్! మిమ్మల్ని ట్రైను ఎక్కినప్పటి నుంచి చూస్తున్నాను. కూర్చున్న చోటు నుండి కదలలేదు. ఒక కాఫీగానీ, టీగానీ తాగలేదు. పోనీ ఏమైనా తిన్నారా అంటే అదీ లేదు. ఒక పేపరుగానీ, పుస్తకంగానీ చదవలేదు. నేను ఇన్ని పనులు చేస్తున్నా తోచడం లేదు. ఎప్పుడెప్పుడు వైజాగ్ వస్తుందా అని చూస్తున్నాను. మీరేమో నిశ్చలంగా ఉన్న నదిలాగ గంభీరంగా అలాగే కూర్చున్నారు. అసలు మీకింతసేపు ప్రయాణం బోరుకొట్టలేదా? ఎలా తోస్తోంది?" అడిగేడు తన ధర్మసందేహాన్ని.

సాధూజీ నవ్వుతూ, "అసలు తోచడం అంటే నీకు తెలుసా? నాకు తోచింది కాబట్టే నీలాగ అన్ని పనులు చెయ్యలేదు. నీకు తోచలేదు కాబట్టే నువ్వు ట్రైనెక్కినప్పటి నుంచి చూస్తున్నాను. ఒక్క గంట స్థిరంగా కూర్చోలేకపోతున్నావు. ఆ గడ్డీ, ఈ గడ్డీ తింటూ, అవీ ఇవీ తాగుతూ, వచ్చిన ప్రతీ స్టేషన్లో దిగుతూ, నేను అన్నీ చూస్తూనే ఉన్నాను. మనసుకు స్థిరత్వం ఉంటే తోచకపోవడం అంటూ ఏమీ ఉండదు" చిన్న ఉపదేశమిచ్చేరు సాధూజీ.

'అమ్మో! ఈయన నిజమైన సాధూజీలానే ఉన్నారు' అనుకున్నాడు. ఇంతకీ ఆయనకెలా తోచిందో భాస్కర్‌కి అంతుపట్టలేదు.

-బులుసు రాధాకృష్ణమూర్తి
(హైదరాబాద్)